# వింత జబ్బు

రాళ్ళల్లో, రప్పల్లో తప్పితే మిగిలిన చరాచర ప్రపంచంలో మార్పులు సంభవించడం అసహజ మేమీ కాదు. మరీ, మైనం లాంటి మానవుడి చిత్తవృత్తిలో మార్పులు రావడం అతి సహజం. కారణమంటూ ఒకటి లేనిదే కార్యముండదు గనుక ఈ మార్పులకు సైతం కారాణాలుండకపోవు, నీళ్ళుండవు, పైరు ఎండిపోతుంది. వర్షాలు బాగా కురిశాయి. నదీప్రవాహం ఎరుపెక్కుతుంది. కొండవూట నీళ్ల త్రాగడం జరిగింది, జలుబు తప్పదు. కారణాలూ కార్యాలూగూడా చాలాచోట్ల యిలా బట్టబయలుగా తెలిసిపోతూనే వుంటాయి. కానీ మానవుడికి సంబంధించినంత వరకూ ఒక్కొక్కప్పుడు కారణాలు మాత్రం ఎక్కడో అతడి అంతరంగంలో గోప్యంగా వుండిపోయి కార్యాలు మాత్రం కొట్టవచ్చినట్టు బయల్పడుతాయి. అలాటప్పుడు అతడు మన కొక అర్థంకాని సమస్యగా గోచరిస్తాడు.

ఉద్యోగరీత్యా దూరప్రాంతాల్లో వుండి ఐదా రేళ్ళతర్వాత స్వగ్రామానికి తిరిగి వచ్చిన నన్ను ఆశ్చర్యంతో వుక్కిరి బిక్కిరి చేసిన విషయాలు రెండు. ఒకటి మా ఊరి ఏటి ప్రవాహగతి, రెండు మా శ్రీధరమూర్తిలో వచ్చిన మార్పు.

నా కేమిటీ, నాలాటి కుర్రాళ్ళందరికీ ఆ రోజుల్లో మా వూరి ఏరు ప్రియభాంధవి. ఇప్పుడైతే విశాలమైన ఎడారిలాంటి ఈ ప్రపంచంలో సౌఖ్యమూ, సంతృప్తీ అన్న ఎండమావుల్ని వెదుక్కుంటూ దేశంపైన గ్రుమ్మరుతున్నాను గానీ, చిన్ననాటి బాల్యక్రీడలకు రంగభూమిగా వుపకరించిన మావూరి ఏటి యిసుకతిన్నెల్లో నాకప్పుడు కొండంత సౌఖ్యమూ, ఎనలేని సంతృప్తీ గోచరించేవి. ఐదేళ్ళ తర్వాత స్వగ్రామానికి చేరుకోగానే ఆటలాడి అలసిపోయి సంజ చీకటిపడగానే తల్లి ఒడిని వెదుక్కుంటూ పరుగెతే పసివాడికిమల్లె, ఏటి వైపు బయల్దేరాను. కానీ చిత్రం! నేనెక్కడైతే ఏటికోసం చూచానో అక్కడ ఏరులేదు. ఒకప్పుడు ప్రవాహం వురకలు వేసుకుంటూ పరుగెట్టినచోట, ఇప్పుడు

ఇసుక మేటలు వేసింది. ఇసుక మేటులపైన ఒండ్రు మట్టి చేరింది. వనమహోత్సవాల సందడిగా అక్కడ కొబ్బరిచెట్లు ఏపుగా పెరిగిపోతున్నాయి.

ఐతే ఏరేమైంది? కొంతదూరం ముందుకు నడచాను. ఎక్కడైతే ఆరోజుల్లో ఏరు లేదో అక్కడ అప్పుడు ఏరు ప్రవహిస్తోంది. మరి యిక్కడ ఒక చిన్న రాళ్ళగుట్ట, నాలుగైదు వేపచెట్లు, చెట్లకు ప్రక్కగా ఓ చిన్న మడికయ్యా వుండినట్టు జ్ఞాపకం! ఊహూ అవేవీ ఇప్పుడులేవు. వాటికి బదులు రాళ్ళకు తగులుతూ, నురగలు గ్రక్కుతూ యిక్కడ ఏరు ప్రవహిస్తోంది.

ఆ సాయంత్రం "ఇదేనా నేనాటలాడుకున్న ఏరు" అని నన్ను నేను ప్రశ్నించు కోవలసివచ్చింది.

ఊళ్ళోకి వచ్చిన తర్వాత సరిగా అదే మాదిరిగా "వీడేనా మా శ్రీధరం?" అని మళ్ళీ ప్రశ్నించుకోవలసి వచ్చింది.

కథ మొదటి నుంచి చెప్పడం మంచిది.

"ఓహో, వాడా! అఖండుడు."

"ప్ఛ్, అతడా! చెడిపోయాడు"

"ఓహో, ఆవిడా నెరజాణ."

ఇలాంటి వూతపదాలు అప్పుడప్పుడూ చెవినిబడుతూనే వుంటాయి. కానీ విన్నప్పుడల్లా వాటికొకే అర్థాన్ని భావించుకున్నట్టయితే మనం అనేక మందిపట్ల తప్పుడు అభిప్రాయాల్ని మాత్రమే సంపాదించుకోగలుగుతాము. అందుకే 'చెవుల్ని నమ్మబోకు, కళ్ళను నమ్ము' అంటుంది ఒక ఆర్యోక్తి.

కానీ.....

"శ్రీధరమా! అతడు బాగా మారి పోయాడోయ్!" ఏ నోటవిన్నా, యిదే మాటయితే!

చెప్పుడుమాటలను వినకుండా యిదేమిటో స్వయంగాచూచి తెలుసుకో వాలనిపించింది. శ్రీధరాన్ని చూడ్డానికి బయల్దేరాను.

◆ ◆ ◆

వీధిలో మెట్లెక్కి, వరాండాను గడుల్నీ దాటుకుని హాల్లోకి ప్రవేశించగానే శ్రీధరంలో వచ్చినమార్పు నాకు దృగ్గోచర మైంది.

ఆ హాల్లో గోడలకు నాకు తెలిసి నాలుగైదు కాలెండర్లు వ్రేలాడుతుండేవి. లేదంటే నాలుగైదు ప్రకృతి దృశ్యాల పటాలుగూడా వుండేవి. ప్రకృతి అంటే యిన్ని నీళ్ళు, కొన్ని తామరపువ్వులు, రెండు టెంకాయచెట్లు, ఒక చందమామ యింతవరకూ మాత్రమే పరిమితమనుకున్న చిత్ర కారుడెవడో వాటిని చిత్రించి వుండొచ్చు- అన్ని పటాల్లోనూ అవే కనిపించేవి, కాదంటే వివిధ భంగిమల్లో!

ఇప్పుడా కాలెండర్లూ లేవు, ఆ ప్రకృతి దృశ్యాలూ లేవు. వాటికిబదులు గోడ నిండుగా దేవతల పటాలు వ్రేలాడుతున్నాయి. సీతారాములు, రాధాకృష్ణులు, పార్వతీ పరమేశ్వరులు, గంగావతరణమూ, శివధనుర్భంగమూ, విశ్వరూప సందర్శనమూ, యిలా యిలా లెక్క లేనన్ని పటాలు! ఏ విషయానికావిషయమే చెప్పుకోవాలి. ఈ పటాల్ని ఎన్నిక చేయడంలో ఎవరోగానీ మంచి విజ్ఞతను కనబరిచారనక తప్పదు. దేవతలన్న పేరుతో విపణి వీధిలో ఎన్నెన్నో వికారమైన పటాలు అమ్ముడుబోతుంటాయి. (నాలుగున్నరడుగయినా మించడానికి వీల్లేని శ్రీ కృష్ణుడు, ఎక్స్ట్రా సినిమా నటుడిలా కనిపించే ఈశ్వరుడు, బుట్ట బొమ్మలా గోచరించే రాధిక వగైరా... వగైరా) మరి, భగవంతుణ్ణి దివ్యమంగళ విగ్రహుడంటారు. ఈ గోడపైన తగిలించిన పటాల్లో దేన్ని చూచినా ఆమాట నిజమే ననిపిస్తోంది.

పటాల ప్రస్తలోకిలోపడి పూజారి సంగతి చెప్పానుకాను. అతడు సరిగంచు పట్టుపంచ కట్టుకున్నాడు. నుదుట విబూది పట్టెలు, కనుబొమలకు దిగువగా కుంకుమబొట్టు. అర మోడ్పు కన్నులు. చేతిలో కర్పూర హారతి. గంభీరంగా శ్లోకం ఉచ్చరిస్తున్నాడు. "మంగళం కోసలేంద్రాయ, మహనీయ గుణాత్మనే....."

సందేహ నివృత్తికోసం ఒకసారి కళ్ళు నులుముకుని, మళ్ళీ చూచాను. సందేహం లేదు, వాడు మా శ్రీధరమూర్తే!

మరి నే నెరిగిన శ్రీధరమూర్తి నాస్తికుడు, శైవుల్లో వీర శైవులు, వైష్ణవుల్లో శ్రీ వైష్ణవులూ వున్నటే మా శ్రీధరమూర్తి వీర నాస్తికుడు, వాడినాస్తికత్వం దేవాలయాల్ని బహిష్కరించడం వరకేగాదు, పురాణాల్లోని అసమంజసవిషయాల్ని, దేవతల పక్షపాత బుద్ధిని చీల్చి చెండాడి, ఎదుటివాడు నోరు మూసుకుని వూరుకున్నా రెచ్చగొట్టి వాదానికి లేవదీసి తర్కవితర్కాలతో వాడి వాదాన్ని పూర్వపక్షంచేసి కళ్ళనీళ్ళు పెట్టుకునేలా వాణ్ణి ఏడిపించి విజయగర్వంతో వికటనృత్యం సలుపుతూ 'ఉన్నాడు, లేదు' అన్న విషయాన్ని గురించి ఎంతో దూరం ఆలోచించలేని నాబోటి వాళ్ళను ప్రాణ గొడ్డంలా ఎదుర్కొనేది!

నిజం చెప్పొద్దూ, నాకు చాలా సంతోషం కలిగింది.

నా కెందుకు సంతోషం కలగాలి? నాలో నేనే వితర్కించుకున్నాను.

ఒక్కమాట మాత్రం నిజం! నా సంతోషం శ్రీధరం ఆస్తికుడైనందువల్ల ఈ అస్తి నాస్తి చికిత్స కంతటికీ హేతుభూతుడైన ఆ పరమాత్ముడికేదో ఒరిగిపోయిందని మాత్రం కాదు.

మరెందుకు?

'ఆ స్ఫురించింది. కథతో అంతగా సంబంధం లేని విషయమేగావచ్చు. కానీ దీన్నిక్కడ విన్నవించుకోడం సమంజసం కాకపోదు.

ఒకనొక పాతమిత్రుడి ద్వారా పరిచయమైన ఒక కొత్తమిత్రుడి యింట్లో ఆతిథ్యం పుచ్చుకోవలసి వచ్చింది. ఆ యింట్లో నలుగురు వచ్చి కూర్చోడానికి వుద్దేశించిన హాల్లో నాలుగైదు పటాలుమాత్రం వ్రేలాడుతున్నాయి. అవి దేవతల పటాలు కావు. మానవుల పటాలు. పేరు చెప్పడ మెందుకుగానీ, ఆ పటాల్లో వున్న వాళ్ళు మనదేశనాయకులు మాత్రం కారు. తమ అభ్యుదయ భావాలన్నింటికీ ప్రతిబింబాలుగా వాళ్ళా మహాపురుషుల్ని తమ యింట్లో ప్రతిష్ఠించుకున్నా రేమో! కావచ్చు. అందుకు నేను వాళ్లని తప్పుపట్టడం లేదు.

కాని ఒక చిన్న అపశ్రుతి!

వంటగది ముందర వసారాలో కూర్చుని భోజనం చేస్తుండగా, ఆ గదిలో ఓమూలగా పరకాయించి చూస్తేగానీ తెలుసుకోడానికి వీల్లేనిచోట గోడకు వ్రేలాడుతూ ఒక పటం కనిపించింది.

ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే అది పార్వతీ పరమేశ్వరులు పటం!

"హాల్లో వాళ్ళని తగిలించి, వంటగదిలో వీళ్ళని బంధించడంతో మీ వుద్దేశ మేమిటి?" అని స్పష్టంగా అడిగేద్దామను కున్నాను. కానీ ఆ దంపతుల దగ్గర సూటిగా మాట్లాడితే లేనిపోని అర్థాలుతీసి, వాళ్ళూ బాధపడి, మనల్నీ బాధపెట్టడానికి కావలసినంత పరిజ్ఞానం పూర్తిగా వుంది. అందుకనే కాస్తా జాగ్రత్తపడి "అక్కడేదో పటమున్నట్టుంది కదండీ" అన్నాను.

"మా అమ్మా, నాన్నా" అంది ఆ యిల్లాలు గంభీర భావభంగిమను ముఖంలో రంగరించుకుంటూ!

ఎంతమాట, ఎంతమాట! అక్షర లక్షలు విలువచేసే మాట అది! ఆ పురాణ దంపతులు తల్లిదండ్రులు కాని దెవరికి? కానీ ఆ తల్లి దండ్రుల్ని లోకానికెందుకు ప్రకటించుకో గూడదో? అదేమైనా మూడోవాడికి తెలియగూడని పరమ రహస్యమా?

ఏమిటో మరి! ఆకుహునా సంస్కారాన్ని అర్థంచేసుకోలేక నేనారోజు తెల్ల బోయిన మాట మాత్రం వాస్తవం!

ఒక మానవుడి జీవిత సాఫల్యతను అతడి జయాపజయాల్ని బట్టిగాక, అతడి సాధననుబట్టి లెక్కగట్టడం న్యాయమంటారు బుధులు. సరిగా అలాగే మానవుడి నిజాయితీని అతడెన్నుకున్న పథాన్నిబట్టిగాక, ఆ పథంలో నడవడానికి వెనుక అతడు కనబరచిన చిత్తశుద్ధినిబట్టి విలువగట్టడమే న్యాయం. ఆరోజుల్లో శ్రీధరం ఎలాగైతే నాస్తికత్వాన్ని త్రికరణశుద్ధిగా నమ్మి దాన్ని ప్రచారం చేయడానికి గూడా పూనుకున్నాడో అలాగే యిప్పుడు తన ఆస్తికత్వాన్ని గూడా బాహాటంగా ప్రకటించుకో గలుగుతున్నాడు. నాకు సంతోషం కలిగింది. శ్రీధరంలో ఈమార్పు వచ్చినందుకుగాదు, వాడి చిత్తశుద్ధికి!

పూజ ముగిసింది. శ్రీధరం తనకు తానే తీర్థం పుచ్చుకుని లోపలికి వెళ్ళబోతుండగా నేను కనిపించాను.

"ఏమిటేమిటి! నువ్వేనట్రా జగన్నాథం? ఎప్పుడొచ్చావు? ఎంత కాలానికి, ఎంత కాలానికి! ఇదిగో సర్వమంగళా! మావాడొచ్చాడు" శ్రీధరం భక్తిపారశ్యంలో నుంచీ ఒక అడుగు క్రిందికి దిగి స్నేహపారవశ్యంతో నన్ను కౌగిలించుకున్నంత పనిచేసి ఉక్కిరిబిక్కిరి చేసేశాడు.

ఇంతలో తల నిండుగా పువ్వులుంచుకుని, కళ్ళల్లో దీపాలు వెలిగించుకున్న శ్రీధరం భార్య కాంచీపురం పట్టు చీరలో కంచి కామాక్షిలా అక్కడికి వచ్చేసింది.

"నేను మాటెత్తితే 'మేం ముగ్గురం' అంటుంటానుగదా సర్వమంగళా. ఆ ముగ్గురిలో నేను నీకు తెలుసు! ఉమాపతి తెలుసు. వీడు మూడోవాడు. సంగ్రహంగా జగ్గూ. సంపూర్తిగా జగన్నాథం."

"కూచోండన్నయ్యా!" అంటూ సర్వమంగళి హాల్లో చాపపరిచింది.

చాపపైన కూర్చోబెట్టి, ఆపాదమస్తకం నన్నొకసారిపరీక్షించి ప్రారంభించాడు శ్రీధరం.

"అదేమిట్రా బాబూ! బొద్దుగా గుమ్మటంలావుండేవాడివి. ఈనగ పుల్లలా తయారై కూచున్నావు! దవడలు పీల్చుకపోయాయి. కళ్ళు లోపలికి పోయాయి. పెదవులు

కమిలిపోయాయి. ఆ రొమ్ముసలా ఒకచేతిలో అదిమితే, ఎముకలు నుగ్గు నూచ మైపోయేట్టున్నాయి. నాకు తెలుసు. సిగరెట్లు విపరీతంగా కాలుస్తున్నావు గదూ?"

"మరినువ్వు? నువ్వు మానేవేశామేమిటి?" అన్నాను. పెల్లుబుకుతున్న విస్మయాన్ని లోలోపలే దాచుకుంటూ.

"నేను మానేసి రెండేళ్లయింది" అన్నాడు నింపాదిగా శ్రీధరం.

నిజమే! కెంపుకు మల్లే మెరుస్తున్నవాడి పెదవులు ఆ విషయాన్ని చెప్పకనే చెబుతున్నాయి.

ధూమపాన విద్యలో శ్రీధరం నాకు గురుతుల్యుడు. అది వాడికి పారంపర్యంగా సంక్రమించిన విద్య. వాడి తాతగారు మూరెడు పొడుగు పొగచుట్టవినా క్షణం గడపలేని నిత్యాగ్ని హోత్రుడు! వాడి నాన్నగారు అనవరతమూ పాషింగు షో సిగరెట్టును కాల్చి కాల్చి ధూమాన్నలా గాలిలోకి వదిలిపెట్టే స్టీమింజను! శ్రీధరం నాన్నగారి టిన్నులోనుంచీ అయిదారు సిగరెట్లను సంగ్రహించుకుని మాయింటి కొచ్చేసేవాడు. చెట్లతో పొదులతో అరణ్యంలాంటి మా పెరట్లో కూర్చుని వరుసగా అన్నింటినీ తెగకాలుస్తూ, ఈ విషయాన్ని రహస్యంగా వుంచే షరతుమీద నాకూ ఒకటి, అరా ప్రసాదించేవాడు!

నా మట్టుకు నేను సిగరెట్టు మానుకోడానికి విశ్వ ప్రయత్నం చేశాను. ఏ దుర్వాడుక నైనా మానుకోడానికి శాస్త్రం రెండు పద్ధతుల్ని సూచిస్తోంది. రెండంతలుగా, మూడింతలుగా దుర్వాడుకను అలా అలా పెంచుకుంటూ పోయినట్లయితే, చివరికి దానిపట్ల అసహ్యం కలుగకమానదు. అప్పుడు దాన్ని మానుకోడం సులభం. ఇది మొదట పద్ధతి. ఈ పద్ధతిని అవలంబించేసరికి అసహ్యం మాటదేవుడెరుగు, గంటకొక్క సిగరెట్టుతో సరిపెట్టుకో గలుగుతున్నవాణ్ణి, అయిదునిమిషాల కొకటి లేకపోతే మరేమీతోచని పరిస్థితి ఏర్పడింది. ఈ తలకుమించిన వ్యవహారాన్ని మళ్ళీ మామూలు స్థాయికి తెచ్చుకునేసరికి బ్రహ్మప్రళయమై పోయింది. ఆ తరువాత రెండోఉపాయాన్ని ప్రయత్నించి చూచాను. ఇప్పుడున్న దుర్వాడుకకంటే తక్కువ హానికరమైనదాన్ని అవలంబిస్తే కాలక్రమాన రెంటినీ అశ్రమంగా మానుకోవచ్చు నంటుంది ఈ పద్ధతి. ఇది కాస్తా సులభసాధ్యంగా గూడా తోచింది. వారంరోజుల పాటు నస్యం వాడుకచేశాను. అంతటితో తల దిమ్మెక్కిపోయి మనం ఈ లోకంలో వున్నామా? లేమా అన్న సందేహం కలగడంతో నస్యం డబ్బీని సైడు కాలవలోకి గిరాటు కొట్టవలసి వచ్చింది. ఆపైన తాంబూల చర్వణానికి వుపక్రమించాను. నాలుక తాటిపట్టిలా మొద్దుబారి, షడ్రుచులూ ఒక్కలాగే తోచి, అన్న హితువు అంతర్ధాన మైపోడంతో

దానికీ స్వస్తి చెప్పుకోవలసి వచ్చింది. దానా దీనా అంతగా హానికరంగాని ఈ చిన్నసైజు దుర్వాడుకల సద్యం ఫలితాలకు తట్టుకోలేక మళ్ళీ పాతపుంతకే రథాన్ని మళ్ళింపవలసి వచ్చింది.

కానీ శ్రీధరానికి యిదెలా సాధ్యమైంది? ఈ ప్రశ్ననే మరొక విధంగా మార్చుకుంటే శ్రీధరంలో యింతమార్పు యెలా వచ్చింది?

ఇంతమాత్రమే కాదు. శ్రీధరంలో యింకా బోలెడన్ని మార్పులొచ్చాయి. రూపాయను చిల్లపెంకులా చూసేవాడు, యిప్పుడొక రూపాయకే పదిరూపాయల విలువయిచ్చి మాట్లాడుతున్నాడు. క్లబ్బులు యువజన సంఘాలు అంటే పడిచచ్చేవాడు ఇప్పుడా ప్రసక్తే తలపెట్టడం లేదు.....

ఈ మార్పులకు కారణమేమిటో. తెలుసుకోవాలన్న వుత్కంఠ నాలో క్షణ క్షణానికీ హద్దులు త్రెంచుకుంటోంది. చివరకు మోహమాటం విడిచిపెట్టి అడిగేశాను కూడా! కానీ ఏంలాభం? వాడు భార్యకేసి ఓరచూపులు బరపుతూ ముసిముసి నవ్వులు చిలకరిస్తాడుగానీ నాకు బదులు చెప్పడే!

ఇదేమిటో తెలుసుకోందే నిద్రపట్టదు గనుక, ఆఖరుకు ఉమాపతిని వెదుక్కుంటూ బయల్దేరాను.

ఉమాపతి మార్గమధ్యంలోనే ఎదురయ్యాడు. నన్ను యింటికి తీసుకెళ్ళి తన సంసారపు గొడవల్లో దించడానికి బదులుగా అతడు పార్కులోకి దారితీశాడు. కానుగచెట్టు కింద, సిమెంటు బెంచీపైన కూర్చుని లేతవెన్నెల్లో పాతస్మృతుల్ని నెమరువేసుకున్నాము. గంట ఎనిమిదయింది. "ఇక వెళ్దామా" అన్నాడు ఉమాపతి.

"అప్పుడే ఎందుకుగానీ, యిదేమిటి ఉమాపతి, ఈ విచిత్రం?" అంటూ శ్రీధరంలో వచ్చినమార్పుని గురించి ప్రస్తావించాను.

"ఓ అదా! అదొకజబ్బులే!" అన్నాడు ఉమాపతి.

"జబ్బా! ఆ జబ్బు నాకూవస్తే బాగుండును" అన్నాను, సద్యాసిగరెట్టు మానేయగలిగితే నెలకు పదిరూపాయలు ఆదా చేయవచ్చు ననుకుంటూ!

"అది నీ కెందుకొస్తుంది? ఆ జబ్బు పెళ్లయిన వాళ్లకు మాత్రమే వస్తుంది" అంటూ ఉమాపతి మరొక రహస్యాన్ని బయటపెట్టాడు.

"మరి నీకలాటిజబ్బేమీ వచ్చినట్టు లేదే! నీకు పెళ్లియిందిగా" అన్నాను.

"అది భార్యభర్తలోని ఏ ఒక్కరికి మాత్రమో వచ్చేజబ్బు!"

"అంటే నీమాటప్రకారం యిలాటిజబ్బు నీ భార్యకు వచ్చివుండాలన్నమాట!"

"అన్నమాటేమిటి! నిజమే అది! ఆవిడకు పెళ్ళిగాక ముందు లెక్కలేనన్ని ఆచారాలు విపరీతమైన దైవభక్తీ, గురువారం సాయిబాబాకని, శుక్రవారం లక్ష్మీదేవికని, శనివారం వేంకటేశ్వరుడికని ఇలా వారంలో ఏ అయిదారురోజులో ఉపవాసమే వుండి పోయేదనుకో! ఇప్పుడా చాదస్తాలన్నీ బాగా సడలిపోయాయి. పెళ్ళికి మునుపు సిగరెట్టు వాసన తగిలితేచాలు, ఇక మూర్ఛపోయినంత పర్యంతమైపోయేది. తిన్న అన్నం కడుపులో నిలిచేది కాదు. ఇప్పుడంటావా పొగను సూటిగా ముఖంపైకి వదిలినా నిక్షేపంగా నవ్వుతూ వుండిపోతుంది. ఇవి ముఖ్యమైన మార్పులనుకో... చిన్న చిన్నవి ఇంకా చాలా వున్నాయి".

"దీనికి శ్రీధరానికి వచ్చిన జబ్బుకూ పోలికలున్నమాట నిజమే" అన్నాను.

"పోలిక లేమిటి! అదే ఇది!" అన్నాడు ఉమాపతి.

ఒకటి రెండు నిమిషాలు మౌనంగా వుండి మళ్ళీ చెప్పుకపోసాగాడు.

"ఆపాయలో నుంచీ ఒకటి, ఈపాయలో నుంచి ఒకటీ కొట్టుకవచ్చి సంగమ స్థానంలో కలుసుకునే మొగిలికొమ్మలకు మల్లే భార్యభర్తలు వివాహబంధం వల్ల సన్నిహితు లౌతున్నారు. వివాహోత్పూర్వం ఆమె పరిసరాలు, ఆచారాలువేరు. అతడి పరిసరాలూ, పరిస్థితులూ వేరు. ఆ భిన్న ప్రకృతులమధ్య కాస్తా సర్దుబాటు అత్యవసరం అవుతుంది. భార్యభర్తలో ఎవరి వ్యక్తిత్వం బలీయమో, వాళ్ళ అభిరుచికి అనుగుణ్యంగా మరొకరు సర్దుబాటు లోనుకావలసి వస్తుంది. అంతేగదూ?" అంటూ నా వైపు సాలోచనగా చూచాడు ఉమాపతి.

'కావచ్చు' అన్నట్టు తల వూపాను.

"ఈ సర్దుబాటునే నేను జబ్బు అని చమత్కరించాననుకో! కానీ ఈ జబ్బు లోకంలో అన్ని జబ్బులలాంటిది గాదు. ఇది కాపురానికి ఆరోగ్యం చేకూర్చే జబ్బు! భార్యభర్తల మధ్య వైరుధ్యాన్ని పోకార్చి సామరస్యం సంధించే, జబ్బు! విశ్వానికి శ్రేయం సంఘటించే కావ్యానికి మల్లేయిది మానవాళికి అంతో యింతో మేలు చేకూరుస్తోంది గనుక ఆ వింత జబ్బు చాలామంచి జబ్బు" అన్నాడు ఉమాపతి!

(ఆంధ్ర సచిత్రవార పత్రిక 23-7-1958)

⊛ ⊛ ⊛